క్లుప్తంగా

విరాళం అందజేత



ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : మండల కేంద్రంలోని శివరామ క్షేత్రాలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి శనివారం రూ.21,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్ మేకల మల్లయ్య, నాయకుడు జంగిలి నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎంజీయూ వసతిగృహాల్లో చపాతి డవ్ మిషన్లు



చపాతి డవ్ మిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ వసతిగృహాల్లో విద్యార్థులకు త్వరితగతిన అల్పాహారం అందించేందుకు గాను చపాతి డవ్ మిషన్లను శనివారం సమకూర్చినట్లు హాస్టల్స్ డైరెక్టర్ దోమల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వార్డెన్లు, సిబ్బందితో కలిసి నూతన పరికరాలను ప్రారంభించారు.

పదోతరగతి ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న మానిటరింగ్ సభ్యులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను శనివారం మానిటరింగ్ సభ్యులు ఎం.సైదులు, ఎస్.రమేష్, బి.వెంకటేశం పరిశీలించారు. సీసీఈ మెథడ్ విధానంలో పరీక్షలు నిర్వహించారా లేదా అని తనిఖీ చేశారు. అన్ని సబ్జెక్టుల మార్కులు, ఫార్మెటీవ్ పరీక్షల మార్కులు, ప్రాజెక్ట్ రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఎంఈఓ అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, చంద్రయ్య, విఠల్, ఆంథోని, చిన్ని శ్రీనివాస్, జయమ్మ, సునంద, మహాలక్ష్మి ఉన్నారు.

ఎంజీయూలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు



పోస్టర్ విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. మద్దిలేటి, రామచంద్రుడు, నీలకంఠం శేఖర్, ఆనంద్, వై. శ్రీనివాస్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

టన్నెల్ ప్రమాదం బాధాకరం

నల్లగొండ టౌన్ : ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ప్రమాదం జరగడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో అన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడి వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి

నల్లగొండ టూటౌన్ : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ప్రమాద ఘటనపై శనివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

నార్కట్‌పల్లి : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడకుండా నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- నిరుపయోగంగా నీటితొట్లు
- తాగునీరు దొరకక అల్లాడుతున్న మూగజీవాలు

కేతేపల్లి : వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గ్రామాలలో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు గ్రామపంచాయతీల నిర్వహణ లోపం, అధికారుల అలసత్వంతో అలంకారప్రాయంగా మారాయి. దీంతో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. తొట్లు ఖాళీగా దర్శనమిస్తుడడంతో పశుపోషకులు చేతి పంపులు, వ్యవసాయ బావుల వద్దకు పశువులను తీసుకెళ్లి దాహార్తిని తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు.

సుమారు 70వరకు నీటితొట్లు..

మండలంలోని 16 గ్రామపంచాయతీలతో పాటు ఐదు శివారు గ్రామాల పరిధిలో పశుగణన లెక్కల ప్రకారం ఆవులు, ఎద్దులు సుమారుగా 2500, గేదెలు 8200, మేకలు, గొర్రెలు 21,500 వరకు ఉన్నాయి. మండలంలో 80శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తుసున్నారు. ఆయా గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చే లక్ష్యంతో 2009 నుంచి 2017 వరకు ఉపాధిహామీ, వాటర్‌షెడ్ తదితర పథకాల కింద సుమారు 70వరకు నీటితొట్లు నిర్మించారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.17వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు చేశారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామశివార్లలో, వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే డొంకబాటల వద్ద నీటితొట్లను నిర్మించారు. కొన్నాళ్లు బాగానే ఉపయోగపడినా తర్వాత నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు తీసుకోవాల్సి ఉండగా చాలాచోట్ల పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమి చేపట్టడం లేదు. దాదాపు సగం తొట్ల వద్ద నీటి వసతి లేదు. ఉన్నచోట బోరు మోటార్లు కాలిపోయి, నల్లా పైపులైన్‌లు పగిలిపోయాయి. ఏళ్ల తరబడి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పలు చోట్ల శిథిమైపోగా, మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలు, చెత్తా, చెదారంతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఎండలు ప్రారంభం కావడంతో మేతకు వెళ్లి వచ్చే పశువులకు నీరులేక అలమటిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



ఉప్పలపహాడ్‌లో చెత్తకుండిలా మారిన నీటితొట్టి



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

మూగజీవాలకు ఇబ్బందిగా మారింది



గ్రామంలో సుమారు 200కుటుంబాలకు పైగా పాడిరైతులు జీవనం సాగిస్తున్నాం. వేసవి ప్రారంభం కావడంతో ఎండలు ఎక్కువ అవుతున్నాయి. పదేళ్ల కిత్రం నిర్మించిన నీటితొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. తొట్ల వద్ద నీటి సౌకర్యం కల్పించి అందుబాటులోకి తీసుకవస్తే మూగజీవాల దాహార్తి తీరుతుంది.

– జటంగి వెంకన్న, రైతు, కేతేపల్లి

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే



నీటితొట్లలో ప్రతిరోజు నీటిని నింపే బాధ్యత పంచాయతీ అధికారులు, సిబ్బంది చూసుకోవాలి. చిన్నచిన్న మరమ్మతుల కారణంగా నీటితొట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశాము. వేసవిలో మూగజీవాలకు నీటి సమస్య కలగకుండా చర్యలు చేపడతాం.

– బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కేతేపల్లి

గ్రామాల లింక్‌రోడ్లను విస్తరించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చండూరులో రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చండూరు మున్సిపాలిటీకి అనుసంధానం అయ్యే వివిధ గ్రామాల లింకురోడ్లను 60ఫీట్లుగా విస్తరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. పట్టణ సెంటర్ వాణిజ్య భవనాల వద్ద రోడ్డు వెడల్పు పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చండూరు బస్టాండ్ నుంచి కనగల్ వైపు శివారు ప్రాంతం వరకు చేపట్టిన రోడ్డు డివైడర్ పనులను పరిశీలించడంతో పాటు పలు మార్పులను సూచించారు. రోడ్డు డివైడర్ మధ్యలో పచ్చగడ్డి లాన్‌తో పాటు అందమైన చెట్లను పెంచేలా నిర్మాణం చేపట్టాలన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించి చండూరు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంత శేఖర్‌గౌడ్, కోడి శ్రీనివాసులు, నల్లగంటి మల్లేశం, భీమనపల్లి శేఖర్, దోటి వెంకటేశ్, ఇరిగి రామన్న, ఇరిగి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు

మునుగోడు: మండలంలోని కచలాపురం గ్రామంలో శ్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని మహిళలు శ్రీనిధి రుణాలను వాయిదాల రూపంలో తీసుకున్నారు. వారు నెలనెలా గ్రామ వీఓఏకు రూ.11లక్షలకుపైగా చెల్లించారు. అతడు ఆ నగదును బ్యాంక్‌లో జమ చేయకుండా తన సొంతానికి ఇటీవల వాడుకున్నాడు. ఆ నగదు రికవరీ కోసం గత సోమవారం ఐకేపీ అధికారులు ఆ గ్రామంలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి లెక్కలు తీశారు. అదే రోజు వీఓఏ కుటుంబ సభ్యులు, బంధువులు మహిళలకు ఇవ్వాల్సిన డబ్బులు తాము ఇస్తామని, అందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో పోలీసులు వారిని ఒప్పించి అతడికి రెండు రోజుల సమయం ఇచ్చారు. సమయం దాటినా నగదు చెల్లించకుండా వీఓఏ పరారీలో ఉండి ఐపీ పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దీంతో 50మంది మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతిఒక్కరూ రూ.10వేల నుంచి రూ. 40వేల చొప్పున ఇవ్వడంతో ఆ డబ్బులు తాము ఎక్కడా తెచ్చి కడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి పరారీలో ఉన్న వీఓఏను పట్టుకొని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

విద్యార్థులు చెడువ్యసనాల బారినపడొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యావర్

నకిరేకల్ : విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడొద్దని, క్రమశిక్షణతో చదవి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని స్థానిక జడ్జి, మండల సివిల్ లీగల్ సేవా సర్వీస్ కమిటీ చైర్మన్ మంజుల సూర్యవర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సేవా సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. యువత గంజాయి, గుట్కా, సిగరెట్లు, మద్యానికి బానిస కావొద్దన్నారు. అనంతరం సీఐ రాజశేఖర్ మాట్లాడారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు విక్రయిస్తే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చామల మల్లారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు ప్రకాష్‌రావు, వెంకన్న, పాపయ్య పాల్గొన్నారు.

కాల్వలపై విద్యుత్ మోటార్ల పరిశీలన



కాల్వలపై అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ రాములు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలపై కొంతమంది రైతులు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను నీటిపారుదల శాఖ ఏఈ రాములు శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీరు కాల్వలపై అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేయడంతో ఆయకట్టులో సాగుచేసిన పంట భూములు ఎండిపోతున్నాయి. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సాగునీటి కోసం నిత్యం రేయింబవళ్లు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులు సాగునీటి పరిస్థితిని నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారుల ఆదేశాలతో నీటి పారుదలశాఖ ఏఈ రాములు ప్రాజెక్టుతో పాటు ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలను, కాల్వలపై ఉన్న అక్రమ విద్యుత్ మోటార్లను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాల్వలపై అక్రమంగా విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి సాగునీటిని ఎగువ ప్రాంతానికి తరలించడం చట్ట వ్యతిరేకమన్నారు. కాల్వలపై ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ మోటార్లను తొలగించి కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట రైతులు చామల జయపాల్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, మద్ది వెంకట్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, గోదల వెంకట్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, కొయ్యడ రవీందర్, వెంకన్న, సైదులు, శ్రీశైలం, లింగయ్య ఉన్నారు.

పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాశయ్యగౌడ్

నల్లగొండ టౌన్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచిన పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ఉందని బీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నకిరెకంటి కాశయ్య గౌడ్ తెలిపారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనులంతా 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బహుజనుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కేశబోయిన శంకర్, కోశాధికారి శ్యాంసుందర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, గోవర్ధన్, నాగిల్ల శ్యాంసుందర్, అంజయ్య, అజయ్, మామిడి సత్తయ్య, జెర్రిపోతుల శంకర్‌గౌడ్, నకిరెకంటి లాలయ్యగౌడ్, వీరమల్ల నాగరాజుగౌడ్, ఆదినారాయణ, సురిగి యాదగిరి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

శాలిగౌరారం : బ్యాంకుల్లో ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ విధిగా జీవిత బీమా చేయించుకొని బీమాగా ఉండాలని ధాన్ ఫౌండేషన్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఆర్‌బీఐ, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు ఉచిత బీమాపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకులో ఖాతాలేని ప్రతిఒక్కరూ ఉచితంగా బ్యాంకు ఖాతాను పొంది ఆ ఖాతా ద్వారా జీవిత బీమా సౌకర్యాలను పొందాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకుమిత్ర వేముల ఆంజనేయులు, సీఎఫ్ఎల్ అసోసియేట్ పలస భూపాల్, వీబీకే వేముల శైలజ, మాచర్ల కృష్ణ, పెరుమాళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందించడం అభినందనీయం



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ పద్మ, బుచ్చిరెడ్డి

కనగల్ : పాఠశాలకు పుస్తకాలు అందించడం అభినందనీయమని ఎంఈఓ వల్లపట్ల పద్మ అన్నారు. శనివారం మండలంలో చర్లగౌరారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన బాలసాహిత్య, పిల్లల కథల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒక మంచి పుస్తకం పఠించడం ద్వారా ఎంతో మానసిక ఆనందం కలుగుతుందని, పుస్తకాలను చదివే అలవాటు మరింతగా పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం రాంబాబు, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, కత్తుల మల్లేశం, మధుసూదన్, నరేందర్‌రెడ్డి, అన్సారి, నహీదా షమీం, రఘునాథరెడ్డి, నరేష్, వెంకటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయసేవా సమితి సభ్యత్వ నమోదు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో సమాచార హక్కు ప్రజావేదిక న్యాయసేవా సమితి నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ షబ్బీర్ హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో అద్దంకి శ్రీశైలచారి, మారోజు సత్యం, మహేష్, పాపయ్య, ఉప్పరి యాదయ్య, ఖలీముల్, యుగేందర్, మల్లేష్, అరవింద్ తదితరులు ఉన్నారు.

బీసీ సంఘాల పోరాటంతోనే కులగణన రీ సర్వే

నల్లగొండ టౌన్ : బీసీ సంఘాల పోరాటంతోనే తెలంగాణలో ప్రభుత్వం కులగణన రీ సర్వే చేపట్టిందని బీసీ ఉద్యమ నాయకుడు వట్టే జానయ్య యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలలో ఎన్నటికీ ఐక్యత రాదని అగ్రవర్ణ పాలకులు అనుకుంటున్న సందర్భంలో బీసీ మేధావులు, నాయకులు, సంఘాలు ఏకమై పోరాటం చేసారని అన్నారు. దీంతో కులగణన రీసర్వేకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వేణుయాదవ్, బెల్లి నాగరాజు, మునాస ప్రసన్నకుమార్, అల్లి సతీష్‌యాదవ్, పుట్ట వెంకన్నగౌడ్, సతీష్, మల్లయ్యయాదవ్, సైదులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సదస్సు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్, రైతు, ప్రజా సంక్షేమంపై ప్రభావం అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజా సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించలేదని విమర్శించారు సదస్సులో జి.నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, తుమ్మల వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అయితగోని వెంకన్న ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి వెంకట్‌రెడ్డి రూ.50వేల నగదు పంపించగా మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి వెంకటయ్య కుటుంబానికి శనివారం అందజేశారు. వారి వెంట ఇడుకుళ్ల రవీందర్, కృష్ణారెడ్డి, కేశవ రెడ్డి, సైదులు, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, బొడ్రాయి వార్షికోత్సవం

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్‌లో శ్రీలక్ష్మి గణపతి సహిత పార్వతీ సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ధ్వజస్తంభ, బొడ్రాయి వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో శనివారం తొలిరోజు గ్రామస్తులు ఆలయంలో, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ యంగలి రామకృష్ణ–జ్యోతి గ్రామంలో సుమారు 3వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శీలం సుదర్శన్, కమిటీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సరోత్తమ్‌రెడ్డితోనే సమస్యలు పరిష్కారం



ఓటు అభ్యర్థిస్తున్న సరూర్‌నగర్ బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తదితరులు

చిట్యాల : నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని, ఆయనతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని బీజేపీ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జ్, జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. మండలంలోని చిట్యాల, వనిపాకల, నేరడ, ఉరుమడ్ల, పెద్దకాపర్తి గ్రామాలలో శనివారం ఆమె ప్రచారం నిర్వహించి పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు నకిరేకంటి మొగులయ్య, చికిలంమెట్ల అశోక్, మాస శ్రీనివాస్, పోట్లపల్లి నర్సింహగౌడ్, కూరెళ్ల శ్రీను, పల్లె వెంకన్నగౌడ్, వరికుప్పల నర్సింహ, బానుక ఉదయ్, ఖమ్మంపాటి సతీష్ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

నకిరేకల్ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటూ చదువుల్లో రాణిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏవీఎం విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏవీఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా నేర్పించడం అభినందనీయమన్నారు. అనంతరం ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కందాల స్వప్నారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి, మాజీ ఎంపీపీ లింగాల మల్లేశ్వరి, ఏవీఎం విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, గగ్గినపల్లి జితేందర్‌రెడ్డి, పీడీ నిమ్మల శంకర్‌గౌడ్, నాయకులు గాదగోని కొండయ్య, నరేందర్ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



చండూరు : స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పాండురంగారావు

చిట్యాల : గ్రామీణ ప్రాంతాలలో విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కస్తూరి ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తుందని చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ అన్నారు. మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, బాలకృష్ణ, బాలయ్య, నయీముద్దీన్, అష్రాఫ్‌ఆలీ, మాధవి, సాయిబాబ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకుల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



నకిరేకల్ : శాస్త్ర పాఠశాలలో..



నల్లగొండ : మాన్యంచెల్క ఉర్దూ మీడియం పాఠశాలలో..



మర్రిగూడ : దామెరభీమనపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో..

నల్లగొండ : పట్టణంలోని మాన్యంచెల్క ప్రభుత్వ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం హబీబ్ మొహమ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు ఫాతిమా జాహెరా, సమీన పర్వీన్, సమీనాబేగం, నాజియా నూరీన్, ఎంఏ.గఫూర్, హబీబ్ ఉర్ రహ్మాన్ జుబెర్, యు.శ్రీధర్ పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని ఎస్‌పీఆర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అధికారుల వేషధారణల్లో అలరించారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ కన్నయ్యగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని శాస్త్ర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారుల వేషధారణల్లో అలరించారు. వేడుకల్లో పాఠశాల చైర్మన్ ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్ సరితారెడ్డి, ఏఓ నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. అనంతరం ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎండావత్ లచ్చిరాం, మంజులత, కొండ శ్రీనివాస్, మీనా, అమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.